

# సరసిజ పరిమళం

కె టిటి బాబు

జన్మాదిని పిన్న, పెరుగుటలో పెద్ద, ఆ తర్వాత వృద్ధ—అన్ని జాతుల్లోనూ వుంది. కానీ—నీలో ఆ మార్పు వెతికినా లేదు.

నవనవలాడే ముకుళదళాలు ఒక్కొక్కటే విప్పుకుంటుంటే—మోట సరసుడు (బాలసూర్యుడు) ఒక్కమారుగా తన ప్రతాపాన్ని వెళ్ళగక్కుతాడు. తాను, తన తూర్పు, తన పడమర, అవన్నీ విసర్జించి నిన్నుచూస్తూ, నీలో మిళితమై, కునికిపాట్లుపడుతూ ప్రయాణం సాగిస్తోంటే—ఎందుకే! అలా ముసిముసి నవ్వులు నవ్వుకుంటావు? అంతకంటే సరసుడు యీ రసికలోకంలో యెవ్వరూ దొరకలేదనా?

నిన్ను పిల్చి, నీతో మాట్లాడుతూ నీ పేరు చెప్పుకుని పరవశులయ్యే, మా సజాతి మిత్రులు యెందరు లేరు? వాళ్ళెవ్వరూ నీ నయనాల్లోంచి దూసుకుపోలేదూ?

కవి—కోమలమైన కలాన్ని గణపతిని తలుచుకుని, ముందుగా నీమీద నడుపుతాడు. తనలో రేగే సరిక్రొత్త సంగతులన్నీ నీకే వొప్పగిస్తాడు. కానీ-అతని కంఠాన్ని కౌగలించుకొని గిలిగింతులు పెట్టే నీ తూండ్లు—ఆ కవిలో వొలికే లలితభావాల్ని అదుపులో పెట్టడం నీకు సాధ్యమౌతుందా? నిన్ను సృజించిన ప్రకృతికి సాధ్యమౌతుందా?

నిలబడేందుకు నడుము లేకపోయినా సరే! నిడువుగా నిగ్గుతేరి, నవనవలాడే బెండపిందెలల్లే, సన్నగా పుల్లలల్లే వంకరలైన వ్రేళ్ళు కలిగివున్నా సరే! వొళ్ళు విరుచుకుంటూ, కళ్లు గిలుపుకుంటూ, ఓ కన్య వొయ్యారంగా నడుస్తుంటే—నిన్ను ఆసరా చేసికొని పసికట్టి, పగబడతాడు. అంతేనా! కాదు ఆవిడ అడుగులికి మడుగులొత్తుతూ—

కమలము నీదు మోవి, మరి కంజదళంబులు నీదు
హస్తముల్
కమలము కన్నుదోయి, నవకాంతులు నీనెడి
యూరు యుగ్మమున్
కమలము వంటి సౌరభము, కాంచ నిర్మిత
కాయమహ్వాహో
కమలము వన్ననీవే, నినుగాంచిన సుఖించిన
హాయి స్వర్గమే!

ఇంకా ఇంకా చెప్పుకుంటూ—తన కలం నిండా, నిన్ను నూరిపోసుకుంటాడు. నీవు లేకపోతే అతని జీవితాభ్యుదయానికి మెఱుగుపెట్టే ధాతలేరి? నీ సగర్వాన్ని, కవికుమారుని ప్రభావంలో కలిపి, రసికామృతాన్ని మథించి, అనవరతం సేవించే రసికబృంద మెంతలేదు?

* * *

అంతరంగిక సుహృద్భావాన్ని వెళ్ళగక్కే చిత్రకారుడు, నీలేమికి నిద్రపోడు. నీ సాటికి సాటి

వాడు. అలాంటప్పుడు—నిన్ను వాంఛిస్తూ, సౌరభాన్ని సేవిస్తూ, నీలో తిరిగే చిత్రకారి నీ ప్రియుడంటే—నీకు సంతోషంకాదూ!

విద్యాగంధం లేక, ముకుళించి మొరుడుగట్టిన మానవ జీవితాన్నికూడా క్షణికంలో ఆకర్షింపిస్తున్నాడంటే! ఎవరిలోవుంది ఆ మహత్యం? అతనికి సర్వదా బద్ధురాలవు. అతని కరానికి నీ రేకలు సలాం చెయ్యక తప్పదు.

అజంతా గుహల్లో అల్లరి చేస్తున్న వ్యంగ్య కన్నెల నడుముల్లే, నీ కాడలుపట్టి, నాలుగు వేపులా తిప్పి, నీ ముఖాన్ని నేలకు చూపుతాడు. ఊఁహూఁ......వద్దని చెప్పే ధైర్యం-నీలో ఏమూలైనా వుందా? ఆ మాత్రం గుండెలే వుంటే!... అతడెంత ఆడినా ఆడాలిసిందే! ఎంత పాడినా పాడాలిసిందే! అతని కుంచికి అదుపులేదు. నీలో దాగిన కాంతికి, మేరలేదు.

* * *

తంబుర మీటుతూ తేనెలొలుకు గానమాధుర్యాన్ని పంచిపెట్టే నారదుడుకూడా నిన్ను స్మరించాల్సిందే!

'కమలా మనోవిహారీ...'

భూసరణంతా పిక్కటిల్లేట్టు, మళ్ళీ మళ్ళీ పాడుతోంటే చక్కగా నిద్రిస్తాడు విష్ణు భగవానుడు. అబ్బ! నీ పేరు విన్నమాత్రాన్నే ఆయన హృదయం జాలిగా, అమాయకంగా అట్టే నిల్చిపోతుంది.

* * *

అనుక్షణం నీకోసం పరితపిస్తూ, నీలోవున్న మాధుర్యాన్ని మరిమరీ త్రాగాలని అభిలషించే భ్రమరానికి అంచక్కటి సంగీతం నీవుకాక, యెవ్వరు నేర్పారు? నిన్నే ఆసరా చేసికొని, నీ నీడలో తిరిగి, నీగాలికి శోషిల్లే నీ అళి......కాదు......నీ తుమ్మెద...ఉహుఁ...అదీకాదు— నీ ప్రియుడు, నీవులేనిదే యెలా జీవిస్తాడు? హృదయ కోశంలోని అడుగు పొరలోనుంచి, యెలుగెత్తి ప్రియతమా! అని, పిలువక పోయినాసరే! నీ సరసికి రమ్మని చేజాచి సైగ చేయకపోయినా సరే!—సంగీతానందం వొలకబోస్తూ నిముషనిముషం నిన్ను వదలక నీ నీడ పట్టున తిరిగే—నీ అలికి నిద్రించేందుకు నీవు తప్ప మరొక తావెక్కడుంది!!

కమలా! నీకు పోలిన కుసుమం నీవేసుమా! మరి నీ పేళ్లో!!!

మధువు కలిపిన మీగడ ముద్దలు. పద్మ, జలజ, అంబుజ, అరవింద, పంకజ, వనజ, అబ్జ, సరోజ, సరసీరుహ, శతదళ, కుశేశయ, పంకేరుహ........

అబ్బ! ఎంచక్కగా వున్నాయి. నీ పేర్లు విన్నాక, నీకే చక్కదనం వచ్చిందా! నిన్ను బట్టి నీ పేర్లకే అందం చిగిర్చిందా! ఈ పేర్లే యింత తియ్యగావుంటే—మరి నీలో వూరే మధువు మరెంత తియ్యగా వుంటుందో! నా నోరూరుతోంది.

ఏ జన్మలోనైనా భృంగానై నీ మధువుని గ్రోలకపోతానా!!! చూడు.


శ్రీ సాయిబాబా

దిసౌత్ ఇండియన్ ఎస్ట్రొలాజికల్ బ్యూరో

9. వెంకట్రాయర్ వీధి. పి. టి. మదరాసు.

శాస్త్రోక్తంగా, దీర్ఘ అనుభవవిజ్ఞానంతో వ్రాయబడును.

1. ఒక జాతకాన్ని వ్రాయడానికి రు. 3-0-0
2. జీవితం, ఆర్థికం, వృత్తి, భార్య, భాగ్యం వీటిగురించివిపులంగా జాతకాన్నివ్రాయడానికి రు. 15-0-0
3. సంవత్సరవారీగా పది సంవత్సరాల భవిష్యత్తును సంఘటనల సరియైనకాలాన్ని ఇతర పరికరాలను తెలుపుతూ వ్రాయడానికి రు. 25-0-0
4. ఒక సంవత్సరానికి సాధారణంగా వ్రాసినందుకు రు. 3-0-0
5. ఒకప్రశ్న రు. 1-0-0

N. B. జన్మనక్షత్రంగాని ఉత్తరంవ్రాసే వేళగాని తెలియజెయ్యాలి. సలహాలిచ్చేకాలం: ఉదయం 8 మొదలు 12 గంటలవరకు

ఏ. దేవనాధన్, జ్యోతిష్కుడు.